

# అదిగో భద్రాద్రి

‘అయితే ఇది కలా? ఇలా?’ అని గొణుక్కున్నాడు వరహాలరాజు, గూర్ఖోపాఖ్యానాన్ని బాధగా పీకుతున్న దవడలతో నెమరువేస్తూ. అతని చేతిలో రూపాయనోటు అమాయకంగా, రెపరెపలాడుతోంది.

‘కలా ఇలా’ అన్నాడు రాజు ఇంకోసారి.

“రెండూకాదు అలా వలా తలాను. గేటు తీశారుగాని కాస్త తప్పుకోండి మేష్టారూ!” అన్నాడు ఎవరో.

రాజు వెనక్కి తిరిగి చూశాడు. చూసి తుళ్ళిపడ్డాడు. ‘హలోసార్ ....చిన్న సందేహం అండి. కాస్త ఇసింటారండి” అన్నాడువినయంగా.

ఆయన తెల్లబోయి అలాగే అని ఓ పక్కకి వచ్చాడు.

"మేష్టారూ ఒకటి కాదండి. రెండున్నాయండి."

"సరే చెప్పండి"

"ఈ రూపాయనోటు నాదేనా?" అన్నాడు రాజు ఆ రూపాయి చూపించి.

"మీచేతిలో ఉంది కాబట్టి మీదే అయుంటుంది."

"ఇందాకళ ఇక్కడ ఆశ్చర్యపడ్డ గూర్ఖాగారు ఒకరుండాలి. వారి చేతిలో రూపాయినోటు ఎవరిది?"

"వారిదే కాబోలు .... మేష్టారూ ఏమిటిది? మీరు పొద్దుట్నుంచీ ఏం పుచ్చుకోలేదా? లేపోతే కాస్త కాఫీ ఎక్కువైందా? మరోలా అనుకోపోతే 'తీర్థం' గినా పుచ్చుకున్నారా? .... ఏమిటి మీరడిగేది? నాకు పనుంది వస్తా అన్నాడు" ఆయన అక్కడే నిల్చుని.

రాజు సిగ్గుపడుతూ తలవంచుకున్నాడు.

"అది కాదండి. మీరు మంచివారిలా ఉన్నారు. నేను కొత్తవాడినిలెండి నాకంతా తికమకగా ఉంది. పోనీ ఇంకోటి చెప్పండి. మీరిందాకళ చూపుడువేలు ముందరికి పెట్టారా?" అన్నాడు.

"ఏమో గుర్తులేదు"

"పెట్టారుసార్. గుర్తుచేసుకోండి. అసలు ఇంకోటి చెప్పండి చెబుతా. మీరూ దిలీప్‌కుమారూ ఒకేగదిలో ఉన్నప్పుడు ఎన్ని కంచాలలో తినేవారు? ఎన్ని మంచాల మీద పడుకునే వారు?"

ఎదుటాయనకి మతి పోబోయింది. కొంచెం ఆగమన్నాడు. "నేను దిలీప్‌కుమారూ ఒక గదిలో ఎందుకుంటామండి. ఉండేటంత

స్నేహితులమే అయితే, ఒక్కకంచంలో ఖచ్చితంగా తింటాం. రెండేసి ఉన్నా చెరోపూటా వాడేవాళ్ళం" అన్నాడు హుషారు తెచ్చుకొని.

రాజుకి ఉత్సాహం పెల్లుబికింది. కలసంగతి తెలిసిపోతోంది.

"రైటోసార్. అదేకావాలి. అదేఅడిగాను. ఇంకొక్కటి చెప్పండి. మీపేరు రామనాధమా-ధనా?" అన్నాడు.

ఎదుటాయన పకపక నవ్వాడు. "హారిపిడుగా, ఎలా కనిపెట్టావు? నా పేరు రెండూను. టమిల్ కంపెనీలో అయితే రామనాధన్, తెలుగు కంపెనీలో అయితే—''.

''నిజమే?" అన్నాడు రాజు కొయ్యబారి పోయి "అయితే ఇందాకళది కల కాదన్నమాట. నేను మూర్ఛపోలేదన్నమాట. ఈ రూపాయ నాదే నన్నమాట. గూర్ఖాచేతిలోంచే తీసుకున్నా నన్నమాట. మీరు చూపుడువేలు ముందుకు పెట్టారన్నమాట. రైటేనా?'' అన్నాడు రాజు గుక్క తిప్పుకోకుండా.

''కొన్ని రైట్లూ కొన్ని తప్పులూ కొన్ని నాకుతెలీదు. మీరు గూర్ఖాచేతిలో రూపాయిపెట్టి పరుగెట్టి మళ్ళీ లాక్కున్నారా; వాడుకాస్త బెదిరిపోయాడు. మీకు వేపకాయంత పెర్రి ఉందని, కరుస్తారని భయపడి కాబోలు, లాగి లెంపకాయ కొట్టాడు. ఆ దెబ్బకి మళ్ళీ మీరు అర్జెంటుగా రైలుగేటు దగ్గిరకెళ్ళి జేరబడ్డారు. నేను ఇదిచూచి మీదగ్గిరికి వచ్చేసరికి అలా వలా తలా అంటున్నారు. నాకింకా అనుమానంగానే ఉంది. వెళ్లొస్తా'' అన్నాడు రామనాధన్.

అంతలోకే గేటు మూసేశారు.

రాజు రామనాధన్ చొక్కా పట్టుకున్నాడు. "క్షమించండి మేష్టారూ గేటుకి దారి చెప్పి వెళ్ళండి" అన్నాడు.

'ఏ గేటు?'

"అదే...."

"ఓ! మీ పేరు?"

"వి. రాజు....మీది?"

"రామనాధ్. టెమిల్ కంపెనీలో ధన్, తెలుగుచోట ధం" అన్నాడు రామనాధన్నాధం నవ్వుతూ.

ఆ నవ్వుచూస్తే రాజుకి ఆరోజు టెంటు సినిమాలోంచి ఊడి పోయిన నటుడు జ్ఞాపకం వచ్చాడు.

"మేష్టారూ ఇంకొక్క సందేహం. మీరెప్పుడైనా మొవ్వారం టెంటుసినిమాలోంచి ఊడిపోయారా?" అన్నాడు జంకుతూ.

రామనాధం ఉలికిపడి వింతగాచూశాడు రాజువంక. ఒక క్షణం ఆగి కొంచెం అవతలఉన్న కొట్టుకి వెళ్ళి సోడా ఒకటి కొట్టి పట్టుకొచ్చి ఇచ్చి 'ఇది పుచ్చుకో ముందర ఆనక మాట్లాడదాం' అన్నాడు గంభీరంగా.

పెద్ద సంబరంలో తప్పిపోయిన పసిపిల్లాడిలా అయిపోయాడు రాజు. అమ్మమ్మ, ముత్యం, వాళ్ళంతా గుర్తుకొచ్చారు. గబగబా సోడా తాగేసి, బ్రేవుమని తేన్చి బావురుమని ఏడిచేశాడు కూలబడి.